
సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం। 6। అక్టోబర్। 2024



అరుణాచలం.. రైలులోనూ వెళదాం

పంచభూతాత్మాక లింగాల్లో అగ్ని లింగం తేజోలింగంగా పేరొందిన అరుణాచలానికి వెళ్లే భక్తుల సంఖ్య జిల్లా నుంచి అధికంగా ఉంటోంది. -8లో



డ్రాగా ముగిసిన మ్యాచ్‌లు

కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-14 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. -8లో

గరిష్టం/కనిష్టం
38.6/26.8

వాతావరణం

జిల్లాలో శనివారం 26.8 - 38.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

జిల్లాలో పలువురు తహసీల్దార్ల బదిలీ

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో ఎనిమిది మంది తహసీల్దార్లు, 12 మంది డిప్యూటీ తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ శివశంకర్ లోతేటి ప్రొసీడింగ్స్ ఇచ్చారు. తహసీల్దార్లలో చాపాడులో పనిచేస్తున్న జి.రవీంద్రారెడ్డిని పులివెందుల ఆర్డీఓ కార్యాలయ ఏఓగా నియమించారు. గోపవరం తహసీల్దార్ వై.ఉదయభారతిని బద్వేలు ఆర్డీఓ కార్యాలయ ఏఓగా నియమించారు.దువ్వూరు తహసీల్దార్ జీవీ మధురవాణిని కలసపాడుకు, ఖాజీపేట తహసీల్దార్ టి.సరస్వతిని చెన్నూరుకు, చెన్నూరులో పనిచేస్తున్న ఆర్.జీవన్ చంద్రశేఖర్‌ను కలెక్టరేట్‌కు, బి.కోడూరులో రీ సర్వే డీటీగా పనిచేస్తున్న మధునాయక్‌ను బి.కోడూరు తహసీల్దార్ ఎఫ్ఏసీగా నియమించారు. అలాగే ముద్దనూరులో డీటీగా ఉన్న ఎల్.వరద కిశోర్‌రెడ్డిని ముద్దనూరు తహసీల్దార్ ఎఫ్ఏసీగా నియమించారు. గోపవరంలో డీటీగా ఉన్న టి.త్రిభువన్‌రెడ్డిని అక్కడే తహసీల్దార్ ఎఫ్ఏసీగా నియమించారు.

బాధ్యతల స్వీకరణ



వినోద్ కుమార్

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్‌గా వినోద్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్‌గా పని చేస్తూ జిల్లాకు బదిలీ అయ్యారు.

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐగా విశ్వనాథరెడ్డి



కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐగా విశ్వనాథ రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. నంద్యాల సెబ్ సీఐగా పని చేస్తున్న ఈయనను కడప ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ సీఐగా నియమించారు.

దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలోని 139 మద్యం దుకాణాలకు ఆసక్తి గల వారు నిర్భయంగా దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవి కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని 9 ఎక్సైజ్ స్టేషన్లలో మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేశామని వాటితో పాటు ఆన్‌లైన్ ద్వారా ఇంటి నుంచి డిజిటల్ పేమెంట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 11న జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో లాటరీ ద్వారా షాపులను కేటాయిస్తామని వెల్లడించారు. మద్యం దుకాణం దక్కించున్న వ్యక్తి అదే రోజు 1/6 శాతం నగదును చెల్లించాలన్నారు. 10 వేల లోపు జనాభా ప్రాంతాలల్లో రూ. 50 లక్షలు, 10 వేల నుంచి 50 వేల జనాభ ఉంటే రూ.55 లక్షలు, 50 వేల నుంచి 5 లక్షల జనాభా ఉంటే రూ. 65 లక్షలు, 5 లక్షల కంటే ఎక్కువ జనాభా ఉంటే రూ. 85 లక్షలు లైసెన్స్ రుసుంగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 110 దరఖాస్తులు వచ్చాయన్నారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండ్ వినోద్ కుమార్, సీఐ విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

కడపలో లలితా జ్యువెల్లరీ షోరూం ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న షోరూం వ్యవస్థాపకుడు కిరణ్ కుమార్, ఎమ్మెల్యే ఆర్. మాధవి

కడప కార్పొరేషన్: తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన లలితా జ్యూవెల్లరీ 56వ షోరూం కడపలో శనివారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి లలితా జ్యూవెల్లరీ వ్యవస్థాపకుడు కిరణ్‌కుమార్, కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్. శ్రీనివాసులరెడ్డి హాజరై రిబ్బన్ కట్ చేసి షోరూంను ప్రారంభించారు. అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రారంభోత్సవ ఆఫర్‌గా బంగారు నగలపై ఇప్పటికే ఉన్న తక్కువ తరుగులో ఇంకా ఒక శాతం తగ్గింపు ఇస్తున్నామని, వజ్రాభరణాల కొనుగోలుపై క్యారెట్‌కు ఇంకా రూ.5వేలు తగ్గింపు ఇస్తున్నామన్నారు. ఈ ఆఫర్లను వినియోగించుకోవాలని ప్రజలను ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే ఆర్. మాధవి మాట్లాడుతూ కడపలో లలితా జ్యూవెలర్స్ షోరూం ప్రారంభం కావడం సంతోషకరమైన విషయమని తెలిపారు.

చేనేత సంఘాల్లో ఏం జరుగుతోంది?

రికార్డులా సరిగా ఉండవు... ఆన్‌లైన్ నమోదుకూ ముందుకు రావు... ఎన్నికలొస్తే చాలు ఛైర్మన్ గిరీ కోసం తాయిలాల ఎర చూపిస్తాయి. జిల్లాలోని చేనేత సహకార సంఘాల పనితీరు అస్తవ్యస్తంగా మారాయి. చేనేత కార్మికుల సంక్షేమాన్ని ఎప్పుడో గాలికొదిలాయి. నిధులను స్వాహా చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నాయి. ఈ నెలాఖరు నుంచి ఆయా సొసైటీలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో చేనేత సంఘాల అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి.

- అక్టోబర్ 21వ తేది నుంచి ఎన్నికల నిర్వహణకు అధికారులు సన్నద్ధం
- కంప్యూటరీకరణకు సహకరించని పలు సొసైటీ యజమాన్యాలు

జమ్మలమడుగు: జిల్లాలో మొత్తం 184 చేనేత శిల్కు, కాటన్ సొసైటీలు ఉన్నాయి. అందులో జమ్మలమడుగు, ప్రొద్దుటూరు ప్రాంతంలోనే అత్యధికంగా సొసైటీలు ఉన్నాయి. గతంలో సొసైటీలకు ప్రభుత్వం నుంచి భారీ స్థాయిలో నిధులు అందేవి. దీంతో చేనేత సొసైటీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. సాధారణంగా సొసైటీలు ప్రభు త్వం నుంచి వచ్చిన నిధులతో కార్మికులకు పనులు కల్పించాలి. వారి సంక్షేమం కోసం కృషి చేయాలి. ఆయా సొసైటీలు ప్రభుత్వం నుంచి వచ్చిన నిధు లు స్వాహా చేస్తూ చేనేత కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా అటకెక్కించాయి. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సిన సంబంధిత అధికారులు సైతం తాయిలాలు తీసుకుని సొసైటీ యజమాన్యానికే వత్తాసు పలికేవారు. ఇక తమకు పనులు కల్పించరనే ఉద్దేశ్యంతో సొసైటీలపై ఫిర్యాదు చేయడానికి కార్మికులు వెనుకడుగు వేసేవారు. ఇదే అదునుగా ఆయా సొసైటీ ఛైర్మన్లు ఎంచక్కా హోదాతో పాటు నిధు లూ అనుభవిస్తూ వస్తున్నారు. ఇక సహకారం సంఘాల ఎన్నికలొస్తే సదరు సొసైటీ యజమానులు కార్మికులకు నయానో భయానో.. కాసింత నజరానో సమర్పించి ఓటింగ్‌లో పాల్గొనేలా చేస్తారు.



మగ్గం నేస్తున్న చేనేత కార్మికుడు

కంప్యూటరీకరణకు రాని సొసైటీలు...

జిల్లాలో చేనేత సహకార సొసైటీ యాజమాన్యం తమ సొసైటీలలో పనిచేస్తున్న కార్మికుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని జౌళిశాఖ అధికారులు కొన్నేళ్లుగా చెబుతున్నారు. ఆయా సంఘం యజమానులు మాత్రం వివరాల నమోదుకు ముందుకు రావడం లేదు. జిల్లాలో ఇప్పటివరకు కేవలం 42 సంఘాలు మాత్రమే ఆన్‌లైన్‌లో తమ సభ్యుల పేర్లను ఎక్కించుకోవటానికి ముందుకొచ్చినట్లు స్వయంగా జౌళిశాఖ అధికారులు వెల్లడించడం గమనార్హం. అంతేకాకుండా చాలా సొసైటీ సంఘాలు పూర్తి స్థాయిలో రికార్డులను ఇవ్వడం లేదని..జనరల్ బాడీ సమావేశాలను నిర్వహించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కేవలం ప్రభుత్వ పథకాల కోసం.. సంబంధిత నిధుల కోసం చూపే ఉత్సాహం సంఘాలను సక్రమంగా నిర్వహించేటందుకు ముందుకు రావడం లేదంటూ ఉన్నతాధికారులు సైతం అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారులు దృష్టి పెడితేనే...

సంఘాల పనితీరుపై అధికారుల పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ఆయా సొసైటీల్లో నిజమైన కార్మికులు ఉన్నారా.. ఉంటే వారికి పనులు కల్పిస్తున్నారా.. ఆయా పథకాలకు.. ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు కార్మికుల సంక్షేమానికి వినియోగిస్తున్నారా.. లేదా యజమానులే స్వాహా చేస్తున్నారా.. తదితర అంశాలపై ఆరా తీయా లి. అప్పుడే నిజాలు వెలుగు చూసి నిజమైన కార్మికులకు మేలు జరుగుతుందని పలువురు వివరిస్తున్నారు. కాగా కొందరు ఛైర్మన్లు తమ సొసైటీలకు ఎన్నికల నిర్వహించుకునేలా అధికారులకు తాయిలాలు సమర్పించే ప్రయత్నాల్లో మునిగితేలుతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో జౌళిశాఖాధికారులపై రాజకీయంగా కూడా ఒత్తిడి తీసుకుని వచ్చే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

21 నుంచి ఎన్నికల నిర్వహణ...

అక్టోబర్ 21వతేది నుంచి డిసెంబర్ 6వతేది వరకు జిల్లాలో ఉన్న అన్ని సొసైటీలకు ఛైర్మన్ ఎన్నికలను నిర్వహించడానికి జౌళిశాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. దానికి సంబంధించిన నిబంధనలు తయారు చేశారు. అందులో ప్రధానంగా సంఘాలకు సంబంధించిన బైలా కాపీలు, మినిట్స్ పుస్తకాలు, క్యాష్ బుక్, సభ్యుల జాబితాను రెండు కాపీలను జౌళిశాఖ కార్యాలయంలో అందించాలని సూచించారు. సంఘంలో కార్యాకలపాలను కొనసాగిస్తున్న వారికి మాత్రమే ఓటు హక్కు ఉంటుంది. సొసైటీలు బ్యాంకులకు సంబంధించిన డబ్బులను సకాలంలో చెల్లించని వారికి ఓటు హక్కు ఉండదని నిబంధనల్లో స్పష్టం చేశారు.

కార్మికులకు మేలు జరిగేలా ఉండాలి




చేనేతసొసైటీలో నిజంగా ఎంతమంది సభ్యులు ఉన్నారో వారందరినీ పిలిపించి ఓటింగ్‌లో పాల్గొనేలా చేయాలి. ఒకే పేరుగల వ్యక్తి చాలా సొసైటీలలో సభ్యులుగా పేర్లు నమోదయి ఉంటాయి. అటువంటి వాటిని తొలగించాలి. అప్పుడే నిజమైన కార్మికులకు న్యాయం జరుగుతుంది. అధికారులు ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలి.

– శివనారాయణ, జిల్లా చేనేత కార్మికుల సంఘం అధ్యక్షుడు.

కలెక్టర్ అనుమతులు తీసుకుని నిర్ణయం

జిల్లాలో చేనేత సహకార ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం చేస్తున్నాం. జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకున్న తర్వాత సొసైటీలు పనిచేస్తున్నాయా లేదా అనే వివరాలు తెలుసుకుని ఎన్నికలు నిర్వహిస్తాం. సొసైటీలు కచ్చితంగా పనిచేస్తూ అందులో కార్మికులు నమోదైన వారికి మాత్రమే ఓటు హక్కు కల్పిస్తాం. నిబంధనల ప్రకారమే ఎన్నికలు జరుగుతాయి.

–నాగరాజరావు, జౌళిశాఖ ఏడీ, కడప



● నేలకొరిగిన అరటి



అరటి రైతుల ఆశలను ఈదురుగాలులు ఆవిరి చేశాయి. పంట చేతికొచ్చే సమయంలో పంటను నేలమట్టం చేశాయి. సింహాద్రిపురం మండలంలో శుక్రవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు సుమారు 500ఎకరాలలో అరటిపంట నేలకొరిగింది. మండల వ్యాప్తంగా 1350 ఎకరాలలో అరటి విస్తీర్ణంలో ఉంది. ప్రస్తుతం అరటికి మంచి ధర ఉంది. దసరాకు కోత కోస్తే చేతికి మంచి లాభాలు వస్తాయని కోటి ఆశలతో ఉండగా.. ఈదురుగాలులు దారుణంగా దెబ్బతీశాయని బాధిత రైతులు వాపోతున్నారు. మండల వ్యాప్తంగా రైతులకు లక్షలాది రూపాయల నష్టం చేకూరింది. సంబంధిత అధికారులు నష్టపోయిన రైతులను గుర్తించి త్వరగా పరిహారం అందేటట్లు చూడాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

-సింహాద్రిపురం

‘ఇన్‌స్పైర్’కు 1046 నామినేషన్లు

- 15 వరకు ఇన్‌స్పైర్ మనాక్ నామినేషన్లకు గడువు

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తయారు చేయాలనే లక్ష్యంతో శాస్త్ర సాంకేతిక విభాగం 2009 -10 విద్యా సంవత్సరంలో నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సహకారంతో భారత ప్రభుత్వం ఇన్‌స్పైర్ మనాక్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అప్పటి నుంచి ప్రతి ఏటా ప్రభుత్వ పాఠశాలలోపాటు ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు సైన్స్ ఆవిష్కరణ ప్రదర్శనలు నిర్వహిస్తూ వస్తుంది. ఇందులో భాగంగా ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా 2024-25 విద్యా సంవత్సరానికి ప్రతి పాఠశాల నుంచి ఐదు ప్రాజెక్టుల చొప్పున యాప్ ద్వారా నామినేషన్లను అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు జిల్లాలో 225 పాఠశాలల నుంచి 1046 ప్రాజెక్టులను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇన్‌స్పైర్ మనాక్ నామినేషన్ల నమోదు చేసుకునేందు గడువు ఈనెల 15వ తేదీ వరకు ఉందని విద్యాశాఖాధికారులు తెలిపారు.

నవంబర్‌లో పెద్దదర్గా ఉరుసు





మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఉరుసు ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు, ఇతర అతిథులు

పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప కల్చరల్: కడపలోని పెద్ద దర్గా వార్షిక ఉరుసు ఉత్సవాలను నవంబరు 15వ తేదీ నుంచి నిర్వహించనున్నారు. పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ అధ్యక్షతన శనివారం ఉరుసు వివరాల పోస్టర్‌ను కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆవిష్కరించి మాట్లాడారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉరుసు నిర్వహణకు ప్రభుత్వ యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. ప్రాథమిక అవసరాలైన నీరు, విద్యుత్, పారిశుధ్యం, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఎమ్మెల్యే మాధవీరెడ్డి మాట్లాడుతూ ఉరుసును విజయవంతం చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, పలు పార్టీల నేతలు మాసీమబాబు, అమీర్‌బాబు, లక్ష్మిరెడ్డి, హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, సుభాన్ బాషా, అఫ్జల్‌ఖాన్, సుంకర శ్రీనివాస్ వివిధ శాఖల ఉన్నతాధికారులు మాట్లాడారు. అంతకుముందు కలెక్టర్ దర్గాలోని ప్రధాన గురువుల మజార్లను దర్శించుకుని ప్రార్థనలు చేశారు.

ఉరుసు వివరాలు
నవంబరు 11న నషాన్
15న ఉత్సవాలు ప్రారంభం
16న గంధం
17న ఉరుసు
18న తహలీల్ ఫాతెహా, ముషాయిరా
19న ఖవ్వాలీ కచేరి
20న పీఠాధిపతి ఊరేగింపు
21న ముగింపు కార్యక్రమాలు

◆ అమ్మవు నీవే.. అఖిల జగాలకు!



అమ్మవారిశాలలో శారదాదేవి

దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులతో దేవీ ఆలయాలు కళకళలాడుతున్నాయి. ముఖ్యంగా దసరా ఉత్సవాలకు పేరుగాంచిన ప్రొద్దుటూరు పట్టణంలో వేడుకలు కన్నులపండువగా సాగుతున్నాయి. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు శారదాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ దేవతా రూపాలు భక్తులను ఆకట్టుకున్నాయి. చెన్నకేశవస్వామి ఆలయంలో ధైర్యలక్ష్మీదేవి, శివాలయంలో, సూపర్ బజార్ రోడ్డులోని చౌడేశ్వరిదేవి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా భక్తులను అనుగ్రహించారు. అలాగే జిల్లాలోని కడప విజయదుర్గాదేవి, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

– ప్రొద్దుటూరు కల్చరల్



క్లుప్తంగా

ప్రమాణ స్వీకారం



మార్క్‌ఫెడ్‌ డైరెక్టర్‌ వి.శశిభూషణ్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న బీజేపీ నేతలు

పులివెందుల టౌన్‌ : విజయవాడలోని ఏపీ మార్క్‌ఫెడ్‌ ప్రధాన కార్యాలయంలో మార్క్‌ఫెడ్‌ చైర్మన్‌ బంగారాజుతో కలిసి మార్క్‌ఫెడ్‌ రాష్ట్ర డైరెక్టర్‌గా బీజేపీ వైఎస్సార్‌ జిల్లా అధ్యక్షుడు వి.శశిభూషణ్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్క్‌ఫెడ్‌ ద్వారా రైతులకు సేవ చేసే అదృష్టం కలుగుతోందన్నారు.

ప్రమాదంలో రైల్వే ఉద్యోగికి తీవ్ర గాయాలు

ముద్దనూరు : ముద్దనూరు–తాడిపత్రి ప్రధాన రహదారిలో మండలంలోని యామవరం గ్రామ సమీపంలో శనివారం మోటార్‌ బైక్‌ అదుపుతప్పి పడిపోవడంతో ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది సమాచారం మేరకు కొండాపురం మండలం లావనూరు గ్రామానికి చెందిన నాగేశ్వరరెడ్డి కొండాపురం పరిధిలో రైల్వే శాఖలో విధులు నిర్వహిస్తున్నాడు. ముద్దనూరుకు వచ్చి తిరిగి కొండాపురానికి మోటార్‌బైక్‌పై ప్రయాణిస్తున్నాడు. బైకు అదుపుతప్పి పడిపోవడంతో నాగేశ్వరరెడ్డి తల, చేతికి, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో ప్రొద్దుటూరుకు అనంతరం మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి కర్నూలుకు తరలించారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష

సంబేపల్లె : మద్యం తాగి ఆటో నడిపినందుకు వెంకటరమణ అనే వ్యక్తికి ఒక నెలపాటు జైలు శిక్ష విధించినట్లు సంబేపల్లె పోలీసులు తెలిపారు. ఇటీవల వాహనాలు తనిఖీ చేస్తుండగా మద్యం తాగి ఆటో నడుపుతున్న వ్యక్తిపై సంబేపల్లె పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. జిల్లా ఫస్ట్‌క్లాస్‌ మెజిస్ట్రేట్‌ ఆసిఫా సుల్తానా నిందితుడికి ఈమేరకు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

అరుణాచలం.. రైలులోనూ వెళదాం!

- అతి తక్కువ చార్జితో ప్రయాణం
- అన్ని వర్గాలకు అనుకూలంగా రైళ్లు



కడప కోటిరెడ్డిసర్కిల్‌ : పంచభూతాత్మక లింగాల్లో అగ్ని లింగం తేజోలింగంగా పేరొందిన తమిళనాడులోని అరుణాచలానికి వెళ్లే భక్తుల సంఖ్య ఉమ్మడి వైఎస్సార్‌ జిల్లా నుంచి అధికంగా ఉంటోంది. గిరి ప్రదక్షిణకు వేలాది మంది భక్తులు తరలి వెళుతున్నారు. కడప మీదుగా రైలు సదుపాయం ఉన్నా అవగాహన లేక భక్తులు బస్సులను ఆశ్రయిస్తుండడం విశేషం.

కడప నుంచి అరుణాచలానికి రోడ్డు మార్గాన వెళ్లేందుకు దాదాపు 300 కిలోమీటర్ల దూరం ఉంటోంది. ఆర్టీసీ బస్సుల్లో సూపర్‌ లగ్జరీలో వెళితే దూరాన్ని బట్టి రాను, పోను రూ.1050–1300 వరకు చార్జి ఉంది. ఒకవేళ కారులో వెళితే దాదాపు రూ. 8–10 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. వీటన్నింటితో పోలిస్తే రైలులో ప్రయాణిస్తే చార్జి తక్కువగా ఉన్నా రిజర్వేషన్‌ అందుబాటులో లేక పోవడంతో అనేక మంది ఇతర వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది.

అందుబాటులో రైల్వేస్టేషన్లు

ఉమ్మడి కడప జిల్లా నుంచి పలు రైళ్లు అరుణాచలం సమీపానికి వెళుతుంటాయి. కడప నుంచి విల్లుపురం 360 కిలోమీటర్ల దూరంలో ఉంది. విల్లుపురం నుంచి అరుణాచలం 60 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఎవరైనా అరుణాచలం వెళ్లాలంటే విల్లుపురం వరకు రైలులో వెళ్లి అక్కడి నుంచి రైలులోగానీ, బస్సులోగానీ, ఇతర వాహనాల్లో కూడా వెళ్లవచ్చు.

■ అహ్మదాబాద్‌ నుంచి తిరుచునాపల్లికి వెళ్లే వారాంతపు రైలు (09419) ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటలకు కడపకు చేరుకుని అదేరోజు సాయంత్రం 7.15 గంటలకు విల్లుపురం చేరుకుంటుంది. తిరిగి ఇదే రైలు (09420) మధ్యాహ్నం 12.10 గంటలకు విల్లుపురంలో బయలుదేరి కడపకు రాత్రి 8.25 గంటలకు చేరుతుంది. ఈ రైలు కడప స్టేషన్‌లో మాత్రమే ఆగుతుంది.

■ అలాగే లోకమాన్య తిలక్‌–మధురై (22101) రైలు ప్రతి గురువారం తెల్లవారుజామున 5.40 గంటలకు కడపకు చేరుకుని అదేరోజు మధ్యాహ్నం 12.30 గంటలకు విల్లుపురం చేరుతుంది. తిరుగు ప్రయాణంలో (22102) ఈ రైలు విల్లుపురంలో శుక్రవారం రాత్రి 8.40 గంటలకు బయలుదేరి మరుసటిరోజు తెల్లవారుజామున 3.08 గంటలకు కడపకు చేరుతుంది. ఈ రైలులోరానుపోను రూ. 540 ఛార్జిగా నిర్ణయించారు.

■ ముంబయి–కరైకల్‌ ఎక్స్‌ప్రెస్‌ రైలు (11017) వారాంతపు ఎక్స్‌ప్రెస్‌గా ఆదివారం తెల్లవారుజామున 5.40 గంటలకు కడపకు చేరి మధ్యాహ్నం 1.55 గంటలకు విల్లుపురం చేరుతుంది. తిరిగి ఇదే రైలు (11018) విల్లుపురంలో సాయంత్రం 7.25 గంటలకు బయలుదేరి మరుసటిరోజు తెల్లవారుజామున 3.10 గంటలకు కడపకు చేరుతుంది.

■ ముంబయి–నాగర్‌కోయిల్‌ (16351) ఎక్స్‌ప్రెస్‌ వారానికి రెండుసార్లు నడుస్తుంది. ఈ రైలు ప్రతి మంగళ, శనివారాల్లో మధ్యాహ్నం 1.20 గంటలకు కడపకు చేరుకుని విల్లుపురానికి అదేరోజు రాత్రి 9.30 గంటలకు చేరుతుంది.

■ కడప నుంచి అరుణాచలానికి ఓఖా–మధురై (09520) ఎక్స్‌ప్రెస్‌ అందుబాటులో ఉంది. ఈ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ రైలు బుధవారం సాయంత్రం 6.05 గంటలకు కడపకు చేరి మరుసటిరోజు అరుణాచలానికి తెల్లవారుజామున 3.40 గంటలకు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఇదే రైలు (09519) అరుణాచలంలో శుక్రవారం ఉదయం 7.30 గంటలకు బయలుదేరి అదేరోజు మధ్యాహ్నం 1.55 గంటలకు కడపకు చేరుతుంది. ఈ రైలులో జనరల్‌ క్లాస్‌లో రూ. 130, స్లీపర్‌లో ఒక్కొక్కరికి రానుపోను రూ.770, త్రీ టైర్‌ ఏసీలో రానుపోను రూ. 2350లుగా ఉంది.

ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి



వైఎస్సార్‌ జిల్లా నుంచి అరుణాచలం వెళ్లే భక్తుల సంఖ్య బాగా పెరిగింది. నేరుగా వెళ్లేందుకు ఓఖా–మధురై ఎక్స్‌ప్రెస్, కడప నుంచి అరుణాచలం వెళ్లేందుకు సమీపంలోగల విల్లుపురం వెళ్లే రైళ్లు అందుబాటులో ఉన్నాయి. అలాగే కడప నుంచి కాట్పాడికి వెళ్లి నేరుగా అరుణాచలం వెళ్లవచ్చు. రైల్వేశాఖ అందిస్తున్న ఈ సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి.

– జనార్దన్, కమర్షియల్‌ ఇన్‌స్పెక్టర్, కడప రైల్వే

చిన్నారి అదృశ్యంపై కేసు నమోదు



అమర్‌ (ఫైల్‌)

దువ్వూరు : దువ్వూరు గ్రామానికి చెందిన తంగెడుపల్లె సాయికుమార్‌ కుమారుడు అమర్‌ (2) ఈనెల 3న గురువారం సాయంత్రం ఇంటి వద్ద ఆడుకుంటూ తప్పిపోయాడు. ఎంత వెతికినా కనిపించకపోవడంతో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వినోద్‌ కుమార్‌ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు దువ్వూరు ఎస్‌ఐ సెల్‌ ఫోన్‌ నంబర్‌ 9121100622, మైదుకూరు రూరల్‌ సీఐ సెల్‌నంబర్‌ 9121100621 సమాచారం ఇవ్వాలని కోరారు.

ప్రొద్దుటూరులో భారీగా గోవా మద్యం పట్టివేత

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక పవర్‌హౌస్‌రోడ్డులోని ఖాళీ గదుల్లో పెద్ద ఎత్తున గోవా మద్యం సీసాలను నిల్వ ఉంచారని సమాచారం రాడంతో వన్‌టౌన్‌ సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ సంజీవరెడ్డి సిబ్బందితో కలిసి శనివారం రాత్రి దాడులు నిర్వహించారు. దాడిలో 816 మద్యం ఫుల్‌ బాటిళ్లు , 72 బీర్లు, 10 రెండు లీటర్ల బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వినాయకనగర్‌కు చెందిన హరి, అమృతానగర్‌కు చెందిన కాటం వీరేంద్రలు నెల క్రితం ఇక్కడ నిల్వ ఉంచినట్లు విచారణలో తెలిసిందని సీఐ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

తూతూ మంత్రంగా వక్ఫ్‌ ప్రజాభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న ఇన్సాఫ్‌ జిల్లా అధ్యక్షుడు కేసీ బాదుల్లా

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కోట్లాది రూపాయల విలువ చేసే వక్ఫ్‌ బోర్డు ఆస్తులను, లక్షలాది ఎకరాల భూములను ముస్లింలకు సంబంధం లేకుండా చేసే సవరణలకు సంబంధించి చేపట్టిన జాయింట్‌ పార్లమెంటరీ కమిటీ అభిప్రాయ సేకరణ తూతూ మంత్రంగా సాగుతోందని ఇన్సాఫ్‌ జిల్లా అధ్యక్షుడు కేసీ బాదుల్లా విమర్శించారు. శనివారం నగరంలోని హోచిమిన్‌ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లింలకు సంబంధించిన స్కూళ్లు, ఇతర విద్యాలయాలు, ధార్మిక సంస్థల ఆస్తులు మైనార్టీలకు సంబంధం లేకుండా సవరణలు తీసుకురావడం ద్వారా రాజ్యాంగం మైనార్టీలకు కల్పించిన ప్రాథమిక హక్కులను కాలరాస్తోందన్నారు. సెప్టెంబర్‌ 28న ఉభయ రాష్ట్రాలకు సంబంధించిన జాయింట్‌ పార్లమెంటరీ కమిటీ హైదరాబాదులో అభిప్రాయ సేకరణలో విశ్రాంత ఐఏఎస్‌ అధికారి ఇంతియాజ్, వక్ఫ్‌ బోర్డులో దీర్ఘకాలికంగా పనిచేసిన షఫీఖుజ్జమాన్‌ తదితర మత పెద్దలు మాట్లాడుతుండగానే సమయం అయిపోయిందంటూ అసహనాన్ని ప్రదర్శిస్తూ బలవంతంగా ఆపేశారని చెప్పారు. ఇప్పటికే వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ ఎంపీలు వ్యతిరేకించారని, ఎన్డీఏ కూటమిలో ఉన్న నితీష్‌ కుమార్‌ పార్టీ ఎంపీలు భిన్నాభిప్రాయాలతో ఉన్నారని తెలిపారు. టీడీపీకి సంబంధించిన పార్లమెంట్‌ సభ్యులు కూడా పార్లమెంటులో ఈ బిల్లును వ్యతిరేకించాలని కోరారు. ఈ సమావేశంలో ఇన్సాఫ్‌ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌.గౌస్, రియాజ్‌ పాల్గొన్నారు.

డ్రాగా ముగిసిన మ్యాచ్‌లు

చిత్తూరు, ప్రకాశం జట్లకు తొలి ఇన్నింగ్స్‌ ఆధిక్యం



తలపడుతున్న చిత్తూరు, కర్నూలు జట్లు



హేమంత్‌ రాయల్‌ ప్రకాశం బ్యాట్స్‌మన్‌ 90 పరుగులు



దినేష్‌ ప్రకాశం బౌలర్‌ 6 వికెట్లు

కడప స్పోర్ట్స్‌ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్‌ జిల్లాల అండర్‌–14 మల్టీడేస్‌ క్రికెట్‌ టోర్నమెంట్‌లో మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. వైఎస్‌ఆర్‌ఆర్‌–ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 87 పరుగుల ఓవర్‌నైట్‌ స్కోరుతో బరిలోకి దిగిన చిత్తూరు జట్టు రెండోరోజు శనివారం 76 ఓవర్లలో 202 పరుగుల వద్ద ఆలౌట్‌ అయింది. జట్టులోని ఆశిషరెడ్డి 41, శ్రీవంత్‌రెడ్డి 33 పరుగులు చేశారు. కర్నూలు బౌలర్లు గిరిధారి 3, వివేక్‌ 3, అంకిత్‌ పరీక్‌ 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌ ప్రారంభించిన కర్నూలు జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 56.3 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 124 పరుగులు చేసింది. జట్టులోని శ్రీవత్సవ 46, నాగచైతన్య 22 పరుగులు చేశారు. చిత్తూరు బౌలర్లు ఆశిష్‌రెడ్డి 2, తేజేష్‌ 2 వికెట్లు తీశారు. దీంతో మ్యాచ్‌ డ్రాగా ముగిసింది. కాగా కర్నూలు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 85 పరుగులకే ఆలౌట్‌ అయిన సంగతి తెలిసిందే. దీంతో చిత్తూరు జట్టుకు తొలి ఇన్నింగ్స్‌ ఆధిక్యం లభించింది.

ప్రకాశం జట్టుకు తొలి ఇన్నింగ్స్‌ ఆధిక్యం..

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 62 పరుగుల ఓవర్‌నైట్‌ స్కోరుతో బరిలోకి దిగిన విశాఖ జట్టు 41.3 ఓవర్లలో 106 పరుగుల వద్ద ఆలౌట్‌ అయింది. జట్టులోని వినోద్‌ 41 పరుగులు, అక్షిత్‌రెడ్డి 28 పరుగులు చేశారు. ప్రకాశం బౌలర్లు దినేష్‌ 6 వికెట్లు, లోకేష్‌ 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌ ప్రారంభించిన ప్రకాశం జట్టు 58 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 151 పరుగులు చేసింది. జట్టులోని ఆర్‌. హేమంత్‌రాయల్‌ 90 పరుగులు చేశాడు. విశాఖ బౌలర్‌ లోహిత్‌ రాఘవేంద్ర 2 వికెట్లు తీశాడు. దీంతో మ్యాచ్‌ డ్రాగా ముగిసింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో ప్రకాశం జట్టు 114 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో ప్రకాశం జట్టుకు తొలి ఇన్నింగ్స్‌ ఆధిక్యం లభించింది.

కడప జట్టుకు తొలి ఇన్నింగ్స్‌ ఆధిక్యం..

కేఓఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 58 పరుగుల ఓవర్‌నైట్‌ స్కోరుతో బరిలోకి దిగిన పశ్చిమగోదావరి జట్టు 64.1 ఓవర్లలో 173 పరుగుల వద్ద ఆలౌట్‌ అయింది. జట్టులోని సుబ్బరాయుడు 34 పరుగులు చేశాడు. కడప బౌలర్లు హితేష్‌సాయి 5, చెన్నకేశవ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌ ప్రారంభించిన కడప జట్టు 48.3 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 110 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్‌డ్రాగా ముగిసింది. కాగా కడప జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 209 పరుగులు చేసి ఉండటంతో కడపకు తొలి ఇన్నింగ్స్‌ ఆధిక్యం లభించింది.

రిజిస్ట్రార్‌ను తొలగించాలి


కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డికి డీవైఎఫ్‌ఐ వినతి



ఎమ్మెల్యే మాధవిరెడ్డికి వినతిపత్రమిస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

కడప ఎడ్యుకేషన్‌ : లైంగిక ఆరోపణలు కలిగిన రిజిస్ట్రార్‌ తప్పెట రాంప్రసాద్‌ రెడ్డిని పదవి నుంచి తొలగించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్‌ డిమాండ్‌ చేశారు. ఈ విషయమై శనివారం కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి, టీడీపీ పొలిట్‌ బ్యూరో సభ్యులు శ్రీనివాసులురెడ్డిని కలిసి డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా శివకుమార్‌ మాట్లాడుతూ ఉన్నత విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువు స్థానంలో ఉండి ఆ పదవికే కళంకితం తెచ్చేలా మహిళల్ని వేధించిన వ్యక్తి రాంప్రసాద్‌ రెడ్డి అని ఆరోపించారు. అలాంటి వ్యక్తికి యోగి వేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌ గా నియమితులవడం దారుణమైన విషయం అన్నారు. 2011లో తెలుగు శాఖ డిపార్ట్‌మెంట్‌తో తన పీహెచ్‌డీ స్కాలర్ల మహిళలను వేధింపులు గురి చేశారన్న ఆరోపణలతో యూనివర్సిటీ కమిటీ కూడా వేసిందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఇటువంటి లైంగిక ఆరోపణ కలిగినటువంటి వ్యక్తుల్ని ఉన్నత పదవులలో ఏర్పాటు చేయడం అంటే ఆ పదవులకే అవమానం అన్నారు. వెంటనే రిజిస్ట్రార్‌ పదవి నుంచి తప్పెట రాం ప్రసాద్‌ రెడ్డిని తొలగించాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నగర కన్వీనర్‌ విజయ్‌ నాయకులు ఉదయ్‌ పాల్గొన్నారు.

రిమ్స్‌లో గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం



గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం

కడప అర్బన్‌ : కడప రిమ్స్‌ మార్చురీలో గుర్తు తెలియని వృద్ధురాలి(60) మృతదేహాన్ని ఉంచారు. గత నెల 20వ తేదీన ఆమె అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరింది. తీవ్ర అనారోగ్యంతో ఈనెల 3న మృతి చెందింది. ఎవరైనా తగిన ఆధారాలతో సంప్రదిస్తే వారికి మృతదేహాన్ని అప్పగిస్తామని రిమ్స్‌ వైద్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



బాలకొండయ్య మృతదేహం

కడప అర్బన్‌ : కడప నగరంలోని కోటిరెడ్డి సర్కిల్‌ కూడలిలో బాలకొండయ్య (60) అనే వృద్ధుడు రోడ్డు దాటుతుండగా సంధ్యా సర్కిల్‌ వైపు నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలకొండయ్యను రిమ్స్‌కు తీసుకుని వెళ్లాలని ప్రయత్నించేలోపే మృతి చెందాడు. కడప నాగరాజుపేటకు చెందిన బాలకొండయ్య రాజారెడ్డి వీధి వైపు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. అతని భార్య శోభారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కడప వన్‌టౌన్‌ పోలీసులు కేసు నమోదు చేశారు.

గంజాయి కేసులో ముగ్గురి అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్‌ఐ

రైల్వేకోడూరు అర్బన్‌ : రైల్వేకోడూరు మండలంలోని మైసూరువారిపల్లి క్రాస్‌ రోడ్డు వద్ద కోడూరు మండలానికి చెందిన దండు సైలు, తోకంచి హరీష్‌లు గంజాయి తరలిస్తుండగా సీఐ హేమసుందర్‌ రావు, ఎస్‌ఐ నవీన్‌ బాబు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి కేజీ గంజాయి, ఒక సెల్‌ ఫోన్‌ స్వాధీనం చేసుకున్నారు. అలాగే పట్టణంలోని మామిడికాయల మార్కెట్‌ యార్డు వద్ద రాజంపేట మండలం బోయనపల్లికి చెందిన కూల్‌ డ్రింక్స్‌ షాపు యజమాని శేఖర్‌ను అరెస్టు చేసి ఒక కేజీ, రెండు వందల గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులకు కోర్టు 14 రోజులు రిమాండ్‌ విధించారు.

ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

బి.కొత్తకోట : ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందినట్టు సీఐ రాజారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు..మదనపల్లె బాలాజీ కాలనీకి చెందిన చాంద్‌బాషా (27) గతనెల 15న బి.కొత్తకోట మండలం కనికలతోపు వైపు నుంచి మదనపల్లెకు బైక్‌పై వెళ్తున్నాడు. ఎర్రమద్దువారిపల్లె వద్దకు రాగానే ఎదురుగా మదనపల్లె వైపు వెళ్తున్న ఆటోను బైక్‌పై వెళ్తున్న చాంద్‌బాషా ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన చాంద్‌బాషాకు మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి తిరిగి మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. ఇక్కడి నుంచి తిరుపతి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చింతపర్తి వద్ద మృతి చెందినట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మదనపల్లె : ద్విచక్ర వాహనం అదుపుతప్పి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం గుర్రంకొండ మండలంలో జరిగింది. పుంగనూరు మండలం కృష్ణాపురానికి చెందిన రవీంద్ర (48), గుర్రంకొండ మండలం నడిమి కండ్రిగ పంచాయతీ పేయలవాండ్ల పల్లికి చెందిన తన అల్లుడు చక్రవర్తి(35)తో కలసి ద్విచక్ర వాహనంలో పుంగనూరుకు వెళ్తుండగా, చెర్లోపల్లె వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడ్డారు. దీంతో తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను 108 వాహనంలో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

బాల, బాలికల తైక్వాండో రాష్ట్ర జట్టు ఎంపిక

రైల్వేకోడూరు అర్బన్‌ : రైల్వేకోడూరులోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న 68 వ అంతర్‌ జిల్లా తైక్వాండో పోటీలలో విజయం సాధించిన బాలురు, బాలికలను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్‌ సెక్రటరీ శారద తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఎంపిక చేసిన ఇరు జట్లు డిసెంబర్‌ రెండవ వారంలో మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ పోటీలలో మన రాష్ట్రం తరపున ఆడతాయన్నారు. బాలికల జట్టుకు అనంతపురం జిల్లా నుంచి క్రిష్ణమ్మ, కీర్తన, విజయనగరం నుంచి ఏవంగిని, రేణుక, హిమశ్రీ, ధనుశ్రీ, కడప నుంచి వైష్ణవి, తేజస్విని, హారిక, విశాఖ పట్టణం నుంచి పూజిత, కృష్ణా నుంచి భవిష్య ఎంపికయ్యారు. అలాగే బాలుర జట్టుకు విజయనగరం నుంచి చందు, అఖిల్, రోహిత్‌కుమార్, శ్రీకాకుళం నుంచి రాజ్‌కుమార్, వెంకటప్రీతం, చిత్తూరు జిల్లా నుంచి సాహిల్, సాయిదేవేందర్‌రావు, తిరులోచన్‌రెడ్డి, అనంతపురం నుంచి లిఖిత్‌కుమార్, తూర్పుగోదావరి జిల్లా నుంచి తొమ్మ జగన్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. స్టేట్‌ రెఫరీ రవిశంకర్‌రాజు పోటీలను పర్యవేక్షించారు. ఫిజికల్‌ డైరెక్టర్‌ విజయ్‌ ప్రసాద్‌రెడ్డి, పరిశీలకులు పాల్గొన్నారు.


వివాహేతర సంబంధమే వీఆర్‌ఏ హత్యకు కారణం



మాట్లాడుతున్న పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్‌

పులివెందుల రూరల్‌ : పులివెందుల నియోజకవర్గం వేముల మండలం వి.కొత్తపల్లి గ్రామంలో గత నెల 29వ తేదీన వీఆర్‌ఏ నరసింహులు హత్య కేసులో బాబు అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్‌ తెలిపారు. శనివారం రాత్రి పులివెందుల పట్టణంలోని స్థానిక అర్బన్‌ పోలీస్‌ స్టేషన్‌లో సీఐ నాగరాజు, వేముల ఎస్‌ఐ ప్రవీణ్‌ కుమార్‌లతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పులివెందుల డీఎస్పీ మాట్లాడుతూ వేముల మండలం వి.కొత్తపల్లె గ్రామానికి చెందిన వీఆర్‌ఏ నరసింహులు, సుబ్బలక్షుమ్మ దంపతులు ఇంటి ఆవరణలోని రేకులషెడ్డులో నిద్రిస్తున్న సమయంలో అర్ధరాత్రి మంచం కింద బ్లాస్టింగ్‌ మెటీరియల్‌ను ఉపయోగించి పేల్చడంతో నరసింహులు మృతి చెందగా, సుబ్బలక్షుమ్మకు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి అప్పట్లో కేసు నమోదు చేసి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌ రాజు ఆదేశాల మేరకు ఆర్కేవ్యాలీ సీఐ నాగరాజు, వేముల ఎస్‌ఐ ప్రవీణ్‌ కుమార్‌లు దర్యాప్తు చేశారన్నారు. శనివారం వేముల మండలం పాత కదిరి రోడ్డులో వాహనాలు తనిఖీలు చేస్తుండగా బాబు అనే వ్యక్తిని అరెస్టు చేసి విచారించామన్నారు. ఈ విచారణలో బాబు ముగ్గురాయి గనులలో కూలీకి వెళ్లే సమయంలో నరసింహులు భార్యతో వివాహేతర సంబంధం ఏర్పడటంతో ఈ విషయం తెలుసుకున్న నరసింహులు, అతని కుటుంబ సభ్యులు బాబును మందలించారన్నారు. నరసింహులుపై పగ పెంచుకున్న బాబు వారు నిద్రపోతున్న సమయంలో మంచం కింద జిలిటెన్‌ స్టిక్స్‌ పేల్చడంతో నరసింహులు అక్కడికక్కడే మృతి చెందగా, అతని భార్యకు తీవ్ర గాయాలయ్యాయన్నారు. పరారీలో ఉన్న బాబును అరెస్టు చేసి అతని వద్ద నుంచి మోటార్‌ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఏఎస్‌ఐ చంద్రశేఖర్‌ స్వామి, పోలీసులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట రామయ్యను దర్శించుకున్న రాష్ట్ర సమాచార కమిషనర్, ఆర్డీఓ



కోదండరామస్వామి సన్నిధిలో రాష్ట్ర సమాచార కమిషనర్‌ చావలి సునీల్‌

ఒంటిమిట్ట : ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయాన్ని శనివారం రాష్ట్ర సమాచార కమిషనర్‌ చావలి సునీల్, కడప ఆర్డీఓగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జాన్‌ ఎర్విన్‌ వేర్వేరు సమయాలలో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి ఆలయ లాంఛనాలతో ఘనంగా స్వాగతం పలికి, ఆలయ ప్రదక్షిణ గావించి బాలాలయంలో ఉన్న ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసి ఘనంగా సత్కరించారు.

తహసీల్దార్‌ కార్యాలయం తనిఖీ

స్థానిక తహసీల్దార్‌ కార్యాలయాన్ని శనివారం కడప ఆర్డీఓగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జాన్‌ ఎరివ్‌న్‌ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట తహసీల్దార్‌ రావణమ్మ, ఆర్‌ఐ భాస్కర్‌ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి మృతి కేసులో నిందితుల అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్‌ఐ

కమలాపురం: మండల పరిధిలోని అప్పారావుపల్లెలో ఈ నెల 3వ తేదీన జరిగిన దాడిలో అదే గ్రామానికి చెందిన శీలం రామక్రిష్ణారెడ్డి మృతి చెందిన కేసుకు సంబంధించి అదే గ్రామానికి చెందిన ఎల్లారెడ్డి, విశ్వనాథ రెడ్డి, చెన్నారెడ్డిలను అరెస్టు చేసినట్లు సీఐ ఎస్‌కే రోషన్‌ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 3వ తేదీ రాత్రి పొలం రస్తా విషయంలో మృతుడు రామక్రిష్ణారెడ్డిపై అదే గ్రామానికి చెందిన ఎల్లారెడ్డి, విశ్వనాథ రెడ్డి, చెన్నారెడ్డిలు దాడి చేశారు. ఈ దాడిలో కింద పడిన రామక్రిష్ణారెడ్డి మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసుకు సంబంధించి ప్రమేయం ఉన్న ముగ్గురు నిందితులను శనివారం అప్పారావుపల్లె క్రాస్‌ వ అరెస్ట్‌ చేసి కోర్టుకు హాజరు పరచగా మేజిస్ట్రేట్‌ ఆదేశాల మేరకు వారిని రిమాండ్‌కు తరలించామన్నారు. ప్రజలు ఏవైనా భూ సమస్యలుంటే రెవెన్యూ, పోలీస్‌ స్టేషన్, కోర్టులను సంప్రదించాలన్నారు. లేని పక్షంలో గ్రామంలోనే పెద్ద మనుషుల వద్ద తమ సమస్యలు పరిష్కరించుకోవడానికి ప్రయత్నం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి, పోలీస్‌ సిబ్బంది పాల్గొన్నారు.